వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య క్యాంపు సేవలు నిర్వహిస్తున్న యశోద ఆసుపత్రి వారిని అభినందించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, డా. వెంకట్ రావు, కె.నాగరాజు, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి, సుభాష్ గౌడ్, సురేష్ గౌడ్, పృథ్వీరాజ్, కల్యాణి, శారద తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కృష్ణారావు

ఉచిత ఆక్యుప్రెషర్ వైద్య శిబిరం


ఉచిత ఆక్యుప్రెషర్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ మహిళా పార్కులో లోహియా ఆరోగ్య జీవన సంస్థ వారి సౌజన్యంతో గాయత్రి నగర్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆక్యుప్రెషర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ సబిహాబేగం ప్రారంభించారు. శిబిరంలో ఆక్యు ప్రెషర్, మాగ్నెటిక్ చికిత్స, వైబ్రేషన్ చికిత్స, సూజోక్ చికిత్సల ద్వారా నడుము నొప్పి, మోకాళ్ల నొప్పి, ఆస్తమా, నిద్రలేమి తదితర వ్యాధులకు మందులు లేకుండా చికిత్స అందించబడుతుందన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, సుమన్, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌కే సొసైటీలో ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: ఆర్‌కే సొసైటీ ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ సబిహా బేగం హాజరై ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు సాయిదత్త గణపతి ఆలయంలో కృష్ణాష్టమి

రాయదుర్గం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం టెలికామ్‌నగర్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో సాయంత్రం 4.30 గంటలకు శ్రీకృష్ణ అష్టోత్తర నామార్చన, 6.15 గంటలకు బాబాకు హారతి, రాత్రి 7 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


రోడ్డుపై చేరిన వరద నీరు

వర్షం పడితే ఇలా..

నిజాంపేట్: బాచుపల్లిలోని ఆదిత్యగార్డెన్ నుంచి ప్రగతినగర్‌కు వెళ్లే రోడ్డు వర్షం పడిదంటే చాలు మోకాళ్ల లోతు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి ఈ మార్గంలో భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు మార్గంలో వరదనీరు సాఫీగా వెళ్లేలా డ్రెయిన్‌లను నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నడిగడ్డతండాలో తీజ్ వేడుకలు


తీజ్ పర్వదిన వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో తీజ్ పర్వదిన వేడుకలను ఆదివారం గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. తీజ్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత సంస్కృతి సంప్రదాయాలను కాపాడిన మహనీయులు సేవాలాల్ మహారాజ్ అని దేశం కోసం, ధర్మం కోసం ఆయన పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, నడిగడ్డతండావాసులు స్వామి నాయక్, లకపతి నాయక్, తిరుపతి నాయక్, శంకర్ నాయక్, రత్నాకర్, అబ్రహం పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మియాపూర్: ప్రతిఒక్కరూ దైవచింతనను కల్గివుండాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ హేమదుర్గా మాత దేవాలయ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, నియోజకవర్గ నాయకులు, డివిజన్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అభిషేకాలు, హోమం, కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.


హేమదుర్గా మాత ఆలయంలో జగదీశ్వర్‌గౌడ్ తదితరులు


కుమారస్వామి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా జన్మదిన వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు కుమారస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కేక్ కట్ చేశారు. పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిమెంట్, రోడ్డు వ్యర్థాలను తొలగించరా?

- రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న వైనం
- రాత్రి వేళ ప్రమాద ప్రయాణం

- తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్వకాలు
- రెండు నెలలు గడిచినా వ్యర్థాలు అక్కడే


పీపీ నగర్‌లోని మసీదు రోడ్డులో వదిలేసిన నిర్మాణ వ్యర్థాలు

చింతల్: జగద్గిరిగుట్ట సబ్ డివిజన్ పరిధిలోని ఉషోదయ సెక్షన్ పీపీ నగర్‌లోని మసీదు ఎదురుగా సుమారు మూడు నెలల క్రితం ఓ కాంట్రాక్టర్ తాగునీటి పైపులైన్‌ను చేపట్టాడు. ఇందులో భాగంగా పైప్ లైన్ మరమ్మతుల కోసం సదరు కాంట్రాక్టర్ అవసరం లేకపోయినా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి మరమ్మతులను నెల రోజుల తర్వాత పూర్తి చేశాడు. నేటికీ రెండు నెలలు గడిచిన సదరు కాంట్రాక్టర్ అక్కడ తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో వెలువడ్డ సిమెంటు, రోడ్డు వ్యర్థాలను తొలగించలేదు. దీంతో అటు మసీదుకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు గుండా ఉదయం సాయంత్రం, వేళల్లో రాకపోకలు సాగించే పాఠశాలల బస్సులు, కార్లు , ఆటోవాలాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో సిమెంట్ వ్యర్థాలు అడ్డుగా ఉండటంతో వెళ్లేందుకు దారి లేక ట్రాఫిక్ జాం అవుతోంది.

ఫోన్ చేసినా స్పందించని అధికారులు

పీపీ నగర్‌లోని మసీద్ ఎదురుగా తవ్వకాలు చేపట్టిన పనులు పూర్తి చేసిన అనంతరం కాంట్రాక్టర్ నిర్మాణ వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. రెండు నెలలు గడిచిన వ్యర్థాలు అక్కడే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఉషోదయ సెక్షన్ మేనేజర్‌కు పలుమార్లు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు యత్నించగా.. ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు. మసీదు ఎదురుగా తవ్వకాలు చేపట్టిన ప్రాంతం కాకుండా ఇంకా అనేక ప్రాంతాల్లో కొంతమంది జలమండలికి సంబంధించిన కాంట్రాక్టర్లు ఇష్టారాజంగా తవ్వకాలు చేపట్టి వదిలేసినట్టు పీపీ నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పైప్ లైన్ వేసి వాల్వ్ అమర్చిన సదరు కాంట్రాక్టర్ గోతులు తీసిన తర్వాత పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో రాత్రి సమయాల్లో ఆ రోడ్డు గుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు ఆ గోతిలో పడి అనేక సందర్భాలలో ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తవ్వకాలు చేపట్టి రెండు నెలలు గడిచిన ఇంతవరకు సదరు సెక్షన్ మేనేజర్, కాంట్రాక్టర్ అటువైపు చూడలేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పైపులైన్‌కు వాల్వ్ అమర్చి పూడ్చకుండా వదిలేసిన గొయ్యి

సర్వే నిర్వహించి అక్రమ కట్టడాలను తొలగించాలి

ఆల్విన్‌కాలనీ: చెరువులు, నాలాల్లో సర్వే నిర్వహించి, వాటి పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో హడావుడికే పరిమితం కాకుండా ప్రతి అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేయాలన్నారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన వివిధ శాఖల అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం సామాన్యుల మీదనే ప్రతాపం చూపకుండా సామాన్యుల మీద సొమ్ము చేసుకున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ, 9వ ఫేజ్‌లోని విజయ గణపతి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యహవాచన, ఋుత్విక్కరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపనాది కార్యక్రమాలు, స్వామివారికి మంగళస్నానం, సాయంత్రం 5 గంటలకు ధ్వజపటం కట్టడం, అంకురారోహణ, వాస్తు మండప చతుషష్ఠి యోగిని, క్షేత్ర పాలక మండప, దేవతా స్థాపన, గణపతి హోమం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు నియోజకవర్గంలోని 14 పాఠశాలలకు సంబంధించి ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులను ఆదివారం హోటల్ తబలాలో సన్మానించి నగదు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చునని అన్నారు. ఆలివ్ స్వీట్స్ అధినేత దొర రాజుని ఎమ్మెల్యే అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో 10/10 మార్కులు సాధించే విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తానని దొర రాజు తెలిపారు.


బహుమతి అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు, ఆల్విన్ మిఠాయి అధినేత దొర రాజు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

బాలగోకులం పోటీలు

మోతీనగర్: పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సంస్కార భారతి, మోతీనగర్ శాఖ ఆధ్వర్యంలో బాలగోకులం పోటీలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గీతం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మైథిలీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. భారతీయ సంస్కృతి, లలిత కళల గొప్పతనాన్ని ఆయన వివరించారు. గౌరవ అతిథులుగా దేవస్థానం చైర్మన్ వి.ఎస్.వి. సత్యనారాయణ, సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జమాల్‌పూర్ నిరంజన్ హాజరై సంస్కార భారతి సంస్థ విశిష్టతను వివరించారు. మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాల పోటీలో 200 మంది పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారని అధ్యక్షులు వేమూరి శ్రీధర్ చాణుక్య తెలిపారు. కార్యక్రమంలో మోతీనగర్ శాఖ ప్రధాన కార్యదర్శి బెజుగం శ్రీనివాస్, మహిళా శక్తి ఇన్‌చార్జి ఉమ, ఉపాధ్యక్షులు సామల యాదగిరి, గోపీనాథ్, కార్యదర్శి శ్రీకర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు క్యూరింగ్ పూర్తి చేయాలి


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు క్యూరింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో రూ.20 లక్షల నిధులతో నిర్మాణ పనులు పూర్తైన సీసీ రోడ్డును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి కాలనీని పచ్చని వనంలా తీర్చిదిద్దుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో రమణ, రాజిరెడ్డి, బాలస్వామి, గణేష్, శివశంకర్, లక్ష్మణ్, మదన్ కుమార్, వాసుదేవరావు, కిషోర్‌రెడ్డి, రాఘవరాజు, శ్రీకాంత్, నాగేశ్వరరావు, అశోక్, హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్


గంట శ్రీనివాస్‌గౌడ్‌తో గౌడ సంఘం ప్రతినిధులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో మోతీనగర్ గౌడ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు పి. శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మోతీనగర్ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంట శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి. వెంకటేష్ గౌడ్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ గౌడ్, సంజీవగౌడ్, కృష్ణ గౌడ్, పి.శ్రీనివాస్ గౌడ్, వంగ బాలాజీ గౌడ్, విక్కీ గౌడ్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

గచ్చిబౌలి: అత్యాచారం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలో నివాసం ఉండే ఎస్.ప్రభాకర్‌రెడ్డి(40) డీఎల్‌ఎఫ్ వద్ద వరలక్ష్మి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువతి(35) పరిచయమైంది. ఇద్దరు కొంత కాలం కలిసి ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని కొద్ది నెలల క్రితం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి



కుత్బుల్లాపూర్: ముందస్తు ప్రణాళికతో లోతట్టు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీని ఆదివారం పరిశీలించారు. ముంపు ప్రాంత ఇళ్ల వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఉమామహేశ్వర కాలనీ వాసులు వరదల్లో చిక్కుకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీరు చేరకుండా రూ.40 కోట్ల నిధులు కేటాయించాలని అధికారులకు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపును తొలగించడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, నాయకులు సరిత రావు, రాజశేఖర్, మాధురి, అశోక్ పాల్గొన్నారు.

పల్లె పోరుకు రంగం సిద్ధం!



- ఓటరు జాబితా తయారీకి శ్రీకారం
- ఓఆర్‌ఆర్ లోపలి గ్రామాలు పురపాలికల్లో విలీనం పై చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగి, రంగారెడ్డి జిల్లాల్లో పల్లెపోరుకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు పూర్తిచేయాలనే లక్ష్యంతో సర్కారు ముందుకెళ్తోంది. ఒకవైపు కులగణన తర్వాతే స్థానిక పోరు ఉంటుందని ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా స్థానిక పోరుకు సంబంధించిన ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ప్రకటించింది. ఇప్పటికే ఓటరు జాబితా, వార్డుల రూపకల్పన తదితర అంశాలపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. జాబితాపూర్తయితే పోలింగ్ తేదీలు విడుదల కావాల్సి ఉంటుంది.

ఆశావహుల్లో...

పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఆరు నెలలు దాటింది. జూన్‌లో మండల, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం ఇంకా ఎన్నికల జోలికి వెళ్లలేదు. ఇదే సమయంలో ఆశావహులైన నాయకులు పంచాయతీలు, మండలాల్లో రూ. లక్షల్లో ఖర్చులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో శివారులోని పంచాయతీలే అధికంగా ఉన్నాయి. పంచాయతీలు పురపాలికలుగా మారినా రాజకీయ నిరుద్యోగం పెరుగుతుంది. సర్పంచి ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ వ్యవస్థ కనపడదు.

వచ్చే నెల 21న వార్డుల వారీగా జాబితా విడుదల...

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29న ఓటరు జాబితా తయారీపై కలెక్టర్లతో ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రచురించనుంది. ముసాయిదాపై సెప్టెంబరు 7 నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అదే నెల 9న జిల్లాస్థాయిలో, 10న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సందేహాలు, అభ్యంతరాలపై చర్చిస్తారు. 19న జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 21న వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల చేస్తారు.

మూడు దశల్లో ఎన్నికలు...

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో 619 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 29 గ్రామ పంచాయతీలు(రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 18) ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో సమీప పురపాలక సంఘాల్లో విలీనం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 590 గ్రామ పంచాయతీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. గతంలోనూ మూడు దశల్లోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం షెడ్యూల్ విడుదల కావడంతో ముందుగా సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావిస్తున్నారు. అయితే రిజర్వేషన్ల విషయం కొలిక్కి రావాల్సి ఉండటంతో ఎన్నికల నిర్వహణపై భిన్నా స్వరాలు వినిపిస్తున్నాయి.

ఓఆర్‌ఆర్ లోపలి పంచాయతీల విలీనంపై...

ఓఆర్‌ఆర్ లోపలి పురపాలికలు,గ్రామ పంచాయతీలను నగరంలో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ దీనిపై అధ్యయనం చేస్తోంది. ఈ కమిటీ ఆమోదం తెలిపితే ఓఆర్‌ఆర్ లోపలి పంచాయతీలు నగరంలో విలీనం అయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పంచాయతీలను ముందస్తుగా సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసి పురపాలికల పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే వాటిని నగరంలో విలీనం చేయనున్నట్లు పంచాయతీల్లో చర్చ సాగుతోంది. ఇదే జరిగితే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందనే భయం నాయకుల్లో వెంటాడుతోంది.

మండలాల వారీగా గ్రామాలు ఇలా...

ఘట్‌కేసర్ మండలంలో అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, మర్పల్లిగూడ, ఎదులాబాద్, ఘనపూర్, వెంకటాపూర్, ప్రతాప సింగారం, కొర్రెముల, కాచవాణి సింగారం, చౌదరిగూడలు ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ విలీనానికి లేఖలు అందజేశాయి.కీసర మండలంలో గోధుమకుంట, కరీంగూడ,రాంపల్లి దాయర, బొగారం, చీర్యాల, నరసంపల్లి, తిమ్మాయపల్లి, కీసర, యాదార్పల్లి, అంకిరెడ్డిపల్లి ఉన్నాయి. శామీర్‌పేట మండలంలో శామీర్ పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట, మేడ్చల్ మండలంలో గౌడవెల్లి, మునీరాబాద్, పూడూరు, రాయిలాపూర్ గ్రామాలు డీపీఓకు లేఖలు సమర్పించాయి.

విలీనం జీపీలు ఇవే...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిని అవుటర్ రింగురోడ్డు వరకు విస్తరించాలనే ప్రభుత్వ నిర్ణయానికి జిల్లాలోని 28 గ్రామ పంచాయతీలకు చెందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు,ప్రజలు మద్దతు తెలిపినట్లు పంచాయతీశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఓఆర్‌ఆర్ లోపలి 18 గ్రామ పంచాయతీలను మాత్రమే సమీపంలోని పురపాలికల్లో విలీనం చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తుండగా, వీటితోపాటు మరో 10 గ్రామ పంచాయతీలు కూడా పురపాలికల్లో విలీనం చేయాలని తీర్మానం చేసి, డీపీఓకు లేఖలు సమర్పించటం చర్చనీయాంశమవుతోంది. మొదటగా గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేసి, పురపాలక సంఘాల పాలక వర్గాల పదవీ కాలం ముగియకానే వాటిన్నింటిని నగరంలో విలీనం చేయనున్నట్లు తెలుస్తోంది.